కథానిక

# బ్రతుకు తెరువు

యం. హీరాలాల్ రాయ్

రామదయాల్ సేట్ దగ్గర ఆరేళ్ళనుంచి నౌకరీ చేస్తున్నాడు రమేశ్. అతనిదగ్గర నే జీవితాంతం వరకూ పర్సనల్ సెక్రెటరీగా పనిచేసి చెల్లుకున్న తండ్రిస్థానాన్ని మళ్ళీ రమేశ్ ఆక్రమించాడు. మెట్రిక్యులేషన్ పాస్ గావడం, తండ్రి చావడం, ఈ ఉద్యోగం లభించడం అలా అకస్మాత్తుగా జరిగిపోయింది. రమేశ్ కి నెలకి అరవై రూపాయల జీతం లభిస్తుంది. అదంతా ఒకేసారి చేతిలో పడదు. "ఎబ్బే! నీవు వట్టి సోమరిపోతువు రమేశ్!" "నీనుంచి ఇక పనికావడం దుస్తరం" మొదలైన ఇలాంటి నీతి ఉపదేశాలూ, రిమార్కులతో సహా సేట్ జీ జేబులోంచి బయటికొచ్చే ఐదు రూపాయలూ, రెండు రూపాయలూ మొత్తంకలిపి నెలమీద అరవై లభిస్తాయి. ఈ గుమాస్తాగిరీతో వాడి జీవితం విసిగెత్తిపోతూన్నది. దీన్ని మానేసి రెండో వుద్యోగం చేతామనే ధ్యాస వాడికి లేదు. ఉన్నా దొరుకుతుందన్న నమ్మకం అసలేలేదు. ఇదంతా ఏడాదినుంచి ఆలోచిస్తూ, బుర్ర బద్దలవుతూ కూడా గానుక చుట్టూ తిరిగే ఎద్దులా, బండని మోసినట్టు, అతి భారంగా గడుపుతున్నాడు రోజులు.

రమేశ్ స్నేహితుల్లో చాలామంది కూడా ఇలాంటి ప్రైవేట్ గుమాస్తాలే. అయినా వాళ్ళకీ ఇతనికీ చాలా తేడా వుంటుంది. వీటితోపాటు నెల కరవై రూపాయల ప్రైవేటు గుమాస్తా పని చేసే చంద్రం ఒక పెద్ద నవాబులా జీవితాన్ని గడుపుతుంటాడు. మంచి వులెన్ సూట్లూ, ప్యాంట్లూ హేరాయిల్సూ ఉపయోగిస్తూ, ఎక్కడో పెద్ద ఆఫీసు మేనేజర్లానో, లేకపోతే లక్షాధికారిలానో వాడూ వాడి స్నేహితులూ డ్యూటీకి వెడతారు. చంద్రం ముఖ్యస్నేహితుడు ప్రకాశరావు, వాడైతే మరీ గంటకో డ్రెస్సు వేయందే వీధిలోంచి తిరగడు. "వీళ్ళంతా తన లాంటి ఉద్యోగమే చేస్తూ, తనకంటే యింత గొప్పగా ఎలాబతుకుతున్నారా అన్నది రమేశ్ కి ప్రస్తుతం ఒక ప్రశ్నగా తయారైంది. తను తొడుక్కోవడానికి-భార్య ఉతికిపెట్టేచొక్కా, ధోవతి తప్ప ఇస్త్రీ ప్యాంట్లూ, షర్టులూ జన్మకి లభించవే. మరి వాళ్ళకి బట్టలూ, స్నోలూ, హేరాయిల్సూ ఎలా లభిస్తున్నాయి? వాడికిందంతా గారడీలా అవుపించి, అయోమయంతో బుర్ర గీక్కుని, చివరికి ఇదంతా తన అసమర్థతేనని కారణం చెప్పుకుని, తన అదృష్టాన్ని లోలోపలే నిందించుకునేవాడు అప్పుడప్పుడు. ప్రపంచంలో కష్టాలనేవి తనకోసమే ప్రత్యేకించబడినవని రమేశ్ అభిప్రాయం.

రమేశ్ కు వున్న సర్వస్వం ఓ అద్దెకొంపా, ముసలితల్లీ, వయసులోకి అడుగు పెడుతూన్న చెల్లీ ఇంతే. ఈ అరవై రూపాలమీదే అందరి భవితవ్యం ఆధారం. ఒక రోజు సరిగ్గా తింటే ఇంకో రోజున తిండి వుండదు. ఈ పరిస్థితిలో వున్న యీ కాస్త ఆధారాన్ని, అసహ్యం పుట్టి వదిలితే, ఇక మెతుకుమెతుక్కీ మాడి చావాల్సిందే. ఈ భయంతోనే వాడి ఆలోచనలన్నీ పారిపోయి హృదయం యథాస్థానంలోకి దిగేది.

అసలు ఇలాంటి ఆలోచనలు రానీయకుండా చేసుకుందామని రమేశ్ ఎన్నోసార్లో ప్రయత్నించి విఫలుడైనాడు. అయినా ఏ మారలోనో లేశమాత్రం మిగిలి, ఏమీ తోచని సమయంలో సముద్రంలా గర్జిస్తూ బయటికొస్తుంటూందదే ఆలోచన "ఎంత విశ్వాసంతో, ఎంత బాధతో డ్యూటీని నిర్వహిస్తూన్నా, కిస్తీలవారిగా మందలింపులూ, ఉపదేశాల్తో లభించే ఆ అరవై రూపాయలు తప్ప చిల్లిదమ్మిడీ ఎక్కువరాదు. అందరి గతీ ఇంతేనా, లేక తనే ఇంత దౌర్భాగ్యపంకంలో కూరుకుపోతున్న అనామకుడా?" ఆలోచన వచ్చిదంటే పై విషయాన్ని గురించే బహువిధాలా ఆలోచిస్తూంటాడు రమేశ్

ఇక రమేశ్ నిర్వహించాల్సిన విధులు: పేరుకు మాత్రం వాడు పర్సనల్ సెక్రెటరీ. అయితే నేం, సేట్ జీ రెండో పెళ్ళి పెళ్ళాం వాడికి పురమాయించని పనిలేదు. బజారుకెళ్ళి చీరెలు బేరం చేసి తేవడందగ్గర్నుంచి వంటింట్లో కొరతపడే వుల్లిపాయలకి కూడా వీడిదే జవాబుదారీ. సేట్ జీ ప్రథమ కళత్రానికి జన్మించి, ప్రస్తుతం స్కూల్ ఫైనల్ పరీక్షకి చదువుతూన్న ఇద్దరమ్మాయిలకి సాయంత్రం గంటన్నర బీజగణితాలూ, అంక గణితాలూ, రేఖా గణితాలూ బోధించి వాళ్ళని వచ్చే పరీక్షల్లో పాస్ చేయించడంగూడా రమేశ్ వంతే. ఆదివారంకూడా ఏవన్నా పనులుంటూనే వుంటాయి. ఇక యజమాని చెప్పే ప్రతి పనీ నిర్వహించాల్సిందే. ఇంతైనా అరవై రూపాయలే గతి. జీతం పెంచమని అడిగితే వున్న వుద్యోగం ఊడవచ్చునసే అనుమానం బలంగా, నిదర్శనాలతో సహా కనిపిస్తున్నందున భయంతో ఆ వూసే ఎత్తుకోవడం మానుకున్నాడు. వీడి మెతకతనాన్ని గుర్తించిన రామదాయాల్ సేట్ వీలుగా వుంటే ఇంకో ఐదూ రూపాయలు తగ్గింపుచేస్తే బావుంటుందేమోనని భావిస్తున్నాడని తెలియడంలో ఆశ్చర్యం ఏమన్నా వుందోలేదో భగవంతుడికే తెలియాలి.

అదృష్టంమీద సర్వకాలికంగా వాలిపోయిన చీకటి పరదాలని తొలగించుకోలేక ప్రాణంవిసిగి, బుర్రపాడైపోయి. సరైన ఆహారంలేక, మనోవ్యాధితో రమేశ్ మంచానబడటం గొప్పవిషయం కాదన్నట్టుగా, రామదయాల్ సేట్, జీతంతో సెలవుని మంజూరుచేయాల్సినంత అవసరం లేదనుకున్నాడు. మంచానపడ్డ రమేశ్ చెల్లాయీ తల్లీ ఇద్దరూ వెళ్ళి, సేట్ జీ కాళ్ళు పట్టుకున్నాకగాని వాడికి వ్యాధిలో వున్నన్నాళ్లూ సెలవు లభించలేదు. పరిస్థితి భయంకరమైనది. కాని, ఆ స్థితిని వాడే స్వయంగా గుర్తించక, డాక్టర్ని కూడా పిలిపించుకోలేకపోయాడు రమేశ్.

రమేశ్ పరిస్థితి పూర్తిగా అర్థంచేసుకుని, వాడి నిజాయతీకీ, అమాయకతకీ విస్తుపోతూ, సానుభూతితో వాడిజీవితాన్ని పరికిస్తుండేవాళ్ళల్లో చంద్రం మొదటివాడు. రమేశ్ జీవితాన్ని గురించి చంద్రానికి ఆమూలాగ్రం తెలుసు. జ్వరంతో మంచానబడి, చాలారోజులకి అదృష్టవశాత్తుగా కోలుకుంటూన్న రమేశ్ తో చంద్రం ఒకనాడు సావకాశంగా మాట్లాడే అదను తీసుకుని జీవితంలో వాణ్ణి రథికుణ్ణిగా తయారుచేయాలనే బలీయమైన ధ్యాసతో సంభాషణ మొదలెట్టాడు.

“రమేశ్! ఇప్పటికి ఆరేళ్ళనుంచీ నువ్వో పెద్ద లక్షాధికారిదగ్గర పనిచేస్తూకూడా నీ బతుకును సుఖంగా మార్చుకోలేక పోతున్నావంటే ఆశ్చర్యం! ఇవాళ మంచానపడ్డావంటే మందు నీళ్ళకి నాలుగణాలుకూడా యింట్లో లేకపోవడం యెంతదరిద్రమో తెలుస్తూందిగదా?” అన్నాడు చంద్రం సీరియస్ గా.

రమేశ్ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. “కాదురా చంద్రం! ముందు నన్నేమిచేయమన్నావో చెప్పు మరి? రోజుకి పద్ధెనిమిది గంటలు అతివిశ్వాసంతో పనిచేసినా సుఖంగా జీవించలేకపోవడం నాకర్మ” అన్నాడు హీనస్వరంతో.

“నిజంగా రామదయాల్ దగ్గర నేనే నీలా ఉద్యోగం చేస్తున్నానంటే ఈపాటికి మదరాస్ లో రెండు మేడలు కట్టించి ఓ గొప్ప ఫిలిం కంపెనీ స్థాపించి పారేసేవాణ్ణి... నీవుపట్టి పిరికి దద్దమ్మవ్... లాభంలేదు” అన్నాడు చంద్రం రమేశ్ ని తీక్షణంగా పరికిస్తూ.

ఈ మాటు రమేశ్ గుండెని చేత్తో పట్టుకుని వణుకుతూ ఇలా అన్నాడు.

“అదే నేనూ ఆలోచిస్తున్నాను చంద్రం! మీరింత సులభంగా బ్రతకడం ఎలా నేర్చుకున్నారా అని. ఎంతకష్టపడ్డా మేం ముగ్గురం ముప్పూటలా తిన్నపాపాన ఎన్నడూపోలేదు. చివరికి నాపరిస్థితి చావుగా మారుతుందేమోనని నాభయం. నిజంగా నీవాదుకోకుంటే అక్షరాలా అలానే జరిగితీరేది” అంటూ ఇంకొంచెం గద్గదస్వరంతో “నేను చావదల్చుకోలేదు చంద్రం! చావంటే నాకు తగనిభయం. నాకళ్ళముందు నాతల్లీ చెల్లాయీ దిగంబరంగా వుంటూ ఆకలికి మాడుతూన్నా, చూడలేక చచ్చిపోలేకపోయాను. కనిపించని, అవ్యక్తమైన, భయంకరమైన ఈబాధని నేను భరించలేను. మరి నా జీవితంలో ఇంతకు మించిన మార్పు ఎలాసంభవిస్తుందో అదీతోచదు. నేనేంచేయను చెప్పు?”

రమేశ్ నిచూస్తే ఆ క్షణంలో చంద్రానికి

విపరీతమైన దయా, జాలీ, ఏర్పడ్డవి. వాడిఆవేదన అశ్రుధార రూపంలో ప్రవహిస్తూంటే చంద్రం కళ్ళకి మబ్బులు కమ్మినట్టయింది. సహజంగా జనించిన ఆవేశంలో "రమేశ్! నీవెంత మంచి వాడివైనా, దుర్మార్గులకి నీమీద జాలికలగడం గానీ, నీ వాస్తవికతని గుర్తించడంకానీ జరగదు. నీ మంచితనం మీదనే మీకుటుంబం మృత్యువుకి ఎరైపోయినా ఆశ్చర్యంలేదు" అన్నాడు.

రమేశ్‌కి హృదయం అంతా చెదిరిపోయింది. ఆదంతా వాడికీ తెలుసు. కాని పరిష్కారమార్గం లేకే ఇలా అవస్థలపాలు కావడం. చంద్రం ఒకోమాట అంటూంటే నీరసించిన దృక్కుల్ని అటువేపు పోనిస్తూ వింటున్నాడు.

చంద్రం కొంచెం కర్కశత్వంతోకూడిన ప్రతీకారస్వరంతో మాట్లాడుతున్నాడు. "రమేశ్! అంతా చేసేది గుమస్తాగిరీలే. కాని ఆ చేయడంలో చాలా తేడావుంటుందని గమనించు. దుక్కి దున్నడానికి అలవాటుపడ్డ ఎద్దులా, కొన్ని యుగాలు నీవీ బండపనిచేసినా పరిస్థితిలో మార్పు రాదు. ఇది విషమప్రపంచంరా! ఈ ప్రపంచం ఎప్పుడూకూడా సుకుమారాల్ని వదలి, నీచాభిరుచుల్నే పోషిస్తుంది. ప్రపంచమంటే ఏమిటో తెలుసా? కొందరు ధనవంతుల కాంట్రాక్టు ఫీల్డ్. అంతే. మరి ఈ ధనవంతులున్నారే వాళ్ళకి హృదయాలుండవనీ, ఉన్నా అవి లోహపుముద్దలని గుర్తుంచుకో, ఈ కఠిన శిలన్ని రుజుమార్గంలోనిలబడి, చచ్చినామనం కరిగించలేం. నీ జీవితం, విశ్వాసానికి జతపట్టి నడిచినంతకాలం మారడం అసంభవం. ఏదో కొంత అక్రమం జరగందే మానవుడికి సుఖంలభించడం ఈరోజుల్లో జరగనిపని!" అన్నాడు.

అక్రమం అనేమాటనుసహించడానికి రమేశ్ తనకిలేని ఓపిక తెచ్చుకుని గుడ్లుమిటకరిస్తు "అక్రమం చేస్తూ బ్రతకడం బ్రతుకేనాచంద్రం?" అన్నాడు. చంద్రం వీడిది పిచ్చన్నట్లు పక్కున నవ్వుతూ "రమేశ్! విను. ఇది న్యాయం, ఇది అన్యాయం, దీనిని చేయవచ్చు, దీనిని చేయకూడదు" అన్న నిషేధాలు ఆచరణలో పెడితే లాభంలేదు. నీవు ఇకముందలా బలహీనతతో ప్రవర్తిస్తే ఈ విశ్వసాధంపునాదిలోపడి నలిగి చస్తావ్ తెలుసా? ఈ ప్రపంచం నీమీద ఉమ్మేస్తుంది. నీ అమాయకత్వంమీద సవాల్ చేస్తుంది. నీ విశ్వాసప్రతిమని లాగి తంతుంది. నీ శవం ఈగలూ, చీమలూముసిరి అతి భయంకరంగా తయారై, మునిసిపాలిటీ నౌకర్లతో ఈడ్పించు కుంటుంది. అప్పుడు నీన్యాయం ఏమాత్రం నిన్ను కాపాడదు. నిన్నెవడూ చచ్చిపోయావని తలవనుకూడా తలవడు" అన్నాడు.

వణికిపోతున్నాడు రమేశ్ ఈమాటలువిని. "చంద్రం! అబ్బ! వీల్లేదు. నేనలా చావడానికి వీల్లేదు. నీవు దేవుడితో సమానం. నీవుచెప్పిన ప్రకారం నేను ఆచరిస్తాను. సుఖంగా బతికే యత్నంచేస్తాను. నాకేదన్నా వుపాయం చెప్పవూ?" అని మంచంమీంచి లేవబోతూన్న రమేశ్‌ని చంద్రం బలవంతంగా ఆపి, పడుకోబెట్టి వాడిఅమాయకత్వానికి లోలోనవ్వుకుంటూ అన్నాడు.

"వుపాయం ఒకాడు చెప్పేదేమిట్రా? నీ తల! ఎవడిముక్కుకు సూటిగా వాడుపోవడం ఎక్కడ మనం బ్రతగ్గలమో గ్రహించడం... ఇందులో నేర్చుకునేదేముంది గనక? అయినా విను...నీవు ముందీవిషయాల్ని శ్రద్ధగా గమనించి వాతావరణంతో పాటు చేయిగలపడం జగగాలి. మీ యజమాని అభిరుచులెలాంటివి...? అతను ఎవర్ని ఎక్కువగా ప్రేమిస్తాడు? ఎంత ఆత్మవిశ్వాసంవుంది? ఏది వింటే సంతోషిస్తాడు...? ఏది వింటే భయపడతాడు? ఎవరెవరితో అతనికి విరోధం? అతనిలో ఇంకా ఏయే బలహీనతలున్నాయి? ఈ విషయాలన్నీ సమగ్రంగా ముందు పరిశీలించు. ఆతరవాత, నీ యజమాని ప్రేమించే వ్యక్తుల్నీ, భయపడేవ్యక్తుల్నీకూడా సంతోషపెడుతూ, వారితో అతిచనువుగా వుండాలి. వాళ్ళు చెప్పింది చేసిపెడుతూండాలి. యజమాని బలహీనతలని, ఉదారాభిప్రాయాలనీ, అత్యుదాత్తమైనవనీ పొగడాలి... సమయానుకూలంగా, ఏదో చేజిక్కించుకుంటూండాలి. అంతే...చిన్న పిల్లలకి పాలుత్రాగడం ఎవడు నేర్పుతాడు? మనిషీ బతకడం అలానే నేర్చుకోవాలి. అప్పుడుచూడు, నీకెంత గౌరవం లభిస్తుందో, నీ మాటకెంత విలువో, నీకోసం నాలాంటివాళ్లెంతమంది ఎదురుచూస్తుంటారో, నీ బ్రతుకులో ఎలా వెన్నెల ఉయ్యాలలూగుతుందో, కాని అన్ని విషయాల్లో

జాగరూకతా, అమాయకతా బహు అవసరం” అని ముగించాడు చంద్రం ఇక చెప్పేదేమీ లేద న్నట్టు. రమేశ్ దగ్గిర సెలవుతీసుకుని వెళ్ళిపో యాడు.

మంచంలో వెల్లకిలా పడుకుని ఆలోచిస్తున్న రమేశ్ కళ్ళల్లో యజమాని రామదయాల్ సేటూ, ఆయన యిల్లూ పరిభ్రమిస్తూన్నది. ఆ యింట్లో ప్రతివస్తువూ తనకు పరిచయమైందే... రామద యాల్ సేట్ రెండో పెళ్ళాం...ఆవిడ చిరునవ్వూ, పిపాసతోనిండినకళ్ళతో చూడ్డం, ఒయ్యారపు నడకా, అన్నీ రమేశ్ కళ్ళల్లో నటిస్తున్నై.ఆవిడ తనవైపు ఎప్పుడూ అదోలాచూస్తుంటే తను కిందికి చూస్తూ సమాధానాలూ, సంజాషీలు చెప్పేవాడు. ఆవిడ తనని కవ్వించినట్టుగా నవ్వుతుంటే, మొద్దులానిలబడేవాడు. ప్రతినిముషం తనకు ఏదో తెర అడ్డంవచ్చేది. తన శిలా హృదయంతో విసు గెత్తిందన్నట్టుగా, ఆవిడ తననిచూస్తే అసహ్యం చుకోవడం మొదలుపెట్టింది. అప్పుడప్పుడు ‘దరి ద్రుడు’అని తిట్టడంకూడా జరిగితే తను వినీ విన నట్టు నటించి యజమాని సేవకసంబంధాన్నే పెరగనిచ్చాడు. ఆవిడకోపంవచ్చి తనని దులి పిన మరునాడే, ఆఫీసులో రామదయాల్ కూడా తనని తిడుతూండేవాడు. అంటే ఆవిడ యింట్లో సేట్ జీతో తనమీద ఏదో చెప్పివుండేదన్నమాట. ఇకపోతే, యజమాని మొదటిభార్య పిల్లలిద్దరూ కూడా షికారుకు తీసికెళ్ళమని ఎన్నోసార్లు అడి గారు. తను ఒంటరిగా వున్నప్పుడెంతో ఆప్యా యంగా మాట్లాడుతూ, అప్రయత్నంగా రాచు కునిపోతూ ఏమీ ఎరగనట్టు నటించేవాళ్ళు. సిని మాకుపోదాం రమ్మని అప్పుడప్పుడు బలవంతం చేసినా తను పోకపోయేవాడు...చివరికి వాళ్ళు కూడా తనని అసహ్యంచుకుని, ఓ అసమర్థుడికింద లెక్కగట్టివేసి, తండ్రితో తనమీద ఎన్నో అబ ద్ధాలాడేవాళ్ళు. ఆ కోపం యజమాని కళ్ళల్లో తను చూస్తూకూడా డ్యూటీ నిర్వహించేవాడు. ఎంతో డబ్బుతో తనచేతులమీదుగా వ్యాపారం జరుగు తోండేది. అయినా తనివాళ్ళ ఇంత నిస్పృహాయుడు. రమేశ్ గుండె గుబుక్కుమంవొకసారి, తనకిప్పుడ దంతా అర్థమవుతోంది... విశ్వాసం, న్యాయం పేరుతో తను ఆత్మవంచనచేసుకున్నాడు. కూటి క్కూడా మొగంవాచిపోయాడు. చావడానికి తయారైనాడు. ...అవివేకం...నైతిక విలువ లనే పర్వతాన్ని ఢీకొని జీవితం చూర్ణంఆయిపో తూన్నది...చంద్రంచెప్పినట్టుగా, ఇప్పుడైనా మేలుకోకపోతే, దుర్మరణంపాలై, తన శవాన్ని పురుగులు పీక్కుతింటాయి. ఏ రోడ్డువెంటనో కుక్కలా మరణించేకంటే, అన్యాయం చేసేనా సరే హాయిగా బ్రతకాల్సిందే.

రమేశ్ తో పరిణామం వచ్చేసింది. వాడిబుద్ధి సంపూర్ణంగా వికసించింది. ధనంయొక్క విలువా, అబద్ధజీవనంలో గల పటుత్వం రెండూ వాడికి తుణ్ణంగా అర్థమైంది. చంద్రం ఉపన్యాసం అక్ష రాక్షరం స్వర్ణఖండంలా వాడికి అనిపించింది.

మళ్ళీ చాలా ఉత్సాహంతో డ్యూటీలో ప్రవేశించాడు రమేశ్. నీరసంగానే ఉన్నప్పటికీ లెక్కచేయలేదు. రాందయాల్ సేట్ కోపంతో గర్జించాడు...“ఇదిగో రమేశ్! నీవు ఇప్పటినుంచి రిగా సెలవులుకోరావంటే నిన్ను పనిలోంచి తీసే యాల్సివస్తుంది. మా పనులు ఈ కొద్దిరోజుల్లో ఎంతోభాగం ఆగినవో ఫైళ్లుచూడు తెలుస్తుంది. ఏదో జబ్బుపడ్డావు ఈమారు సరిపోయింది... ఇంకోవిషయం-నీవంటే మా చిన్నావిడక్కూడా





*Enquiries to :*

# RECHLABS,

**30, Alamelumangapuram,**

**MYLAPORE : : MADRAS-4**

**OR**

**550, 8th Main Road,**

**MALLESWARAM : : BANGALORE-3**

క్రోసంగానేవుంది...చెప్పినమాట వినిపించుకోవట. అవిధేయిత వదలాలి నీవు...పిల్లలకికూడా సరీగా చదువుచెప్పడం చాతగాదు... నీనుంచి డబ్బు దండగేగాని, లాభంలేదు...సరే! వెళ్ళు! ఇక్కణ్ణించీ జాగ్రత్త" అన్నాడు సేట్‌జీ.

"ఈసారి క్షమించండి! ఇకనుంచీ నామీద ఏవైనా ఆరోపణలు వస్తే అడగండి! అన్ని విధులూ సక్రమంగా నిర్వహిస్తాను" అన్నాడు రమేశ్ అతివినయంగా.

"సెబాస్" అంటూ లేచి యింట్లోకి పోయాడు సేట్‌జీ.

చంద్రం దగ్గరనుంచి అడిగితెచ్చుకున్న వులెన్ సూటు వేసుకుని, నీటుగా, కాలేజీ స్టూడెంట్ లాగా ఒకనాడు ఆఫీసుకెళ్ళాడు. సేట్‌జీ భార్య రమేశ్‌లో మార్పు చూసి, ఆశ్చర్యపడకుండా వుండలేకపోయింది. కొన్నాళ్ళకిందటిలా ఆతని చూపులూ, వాలకం అంత నీరసంగాలేవు ప్రస్తుతం. ఇవాళ రమేశ్ చిన్నరాణి వాల్చూపులని అర్థం చేసుకుంటూ అలాంటిదృష్టినే ధైర్యంతో మళ్ళీ ప్రత్యుత్తరంగాపంపాడు. ఆచూపు ఎంతో చురుగ్గా ఒక వాంఛని, ఒకవిధమైన రసికతని ప్రస్ఫుటం చేస్తూన్నాయి. ఒక సందేశాన్నిస్తూన్నాయి. మనస్సులో గూడుకట్టుకున్న అంధకారం చెల్లా చెదరైపోయినట్టనిపించింది రమేశ్‌కి...చిన్నా విడ రమేశ్‌ని ఒంటరిగా వున్నప్పుడు చూసి

"నీ వివాళ బలే అందంగా వున్నావ్ రమేశ్! ఏదో నీలో కొత్త మార్పు వచ్చేస్తున్న దనుకుం టూను" అంది ఆదోరకంగా.

"ఏదో మీదయ. మనస్సు కొంచెం ఉల్లాసం గానేవుంది" అని వినయంగా జవాబిస్తూ కొంటెగా ఆవిడ ముఖంలోకి చూశాడు రమేశ్.

వెచ్చని గాఢసుఖాన్నికోరే ఆవిడ ఉద్రిక్త శరీరం ఈమారు ఒక్కసారి కదిలింది. ముఖం జలదరించింది. పెదవులమీద అప్రయత్నంగా ఓ చిరునవ్వు మెరిసింది. జవాబుగా రమేశ్ వద్ద నుండి, మళ్ళీ అదే చంద్రహాసంలాంటి పదునైన మందహాసం తొణికింది. అందులో జీవంవుంది. సౌందర్యం మెరుస్తూన్నది.

"నీతో కాస్త పనుంది. కూర్చో రమేశ్! నే నిప్పుడే లోపలి కెళ్ళొస్తాను" అంటూ ఆవిడ చప్పున లోపలికిపోయింది. రమేశ్ తలవూపి, అక్కడేవున్న సోఫామీద వాలి క్రాపును సరి జేసుకుంటూన్నాడు. అతనిలో ఏవిధమైన, సిగ్గు గానీ, యజమాని అంటే భయంగానీ, ఎవరైనా పరిహాసిస్తారనే బెదురుగానీ లేవు. స్వర్గం, నరకం, నీతీ, అవినీతీ, ఏవీ ఇవాళ అతన్ని తాకడానికి భయపడుతూన్నాయి. చిన్నరాణి చెప్పిన ప్రతి పనినీ ఆవిడకి సంతోషం కలిగేలా నిర్వహించ డానికి అతను "సిక్ బెడ్" మీదే నిశ్చయించు కున్నాడు.

తళతళ మెరిసే సిల్కు దుస్తుల్లోవుండి, సవి లాసంగా పైటను జార్చి, హాల్లోకి ప్రవేశించింది ఆవిడ మళ్ళీ. ఓ అందమైన రాజకుమారిలా ముస్తాబై, వచ్చి రావడంతోనే, "ఇవాళ మా వారు లేరు. మీరు నన్ను కొంచెం షికారుకుతీసి కెళ్ళాలి కార్లో. బహుశా నాతో తిరగడానికి మీకేమీ అభ్యంతరం లేదనుకుంటాను" అంది ఆదోవిధంగా చూస్తూ. ఈ బహువచన ప్రయో గానికి రమేశ్ అంత ఆశ్చర్యపడలేదు. కాని, తాను ఏర్పరచుకున్న భావం పునాదిలేనిది కాదని దృఢనిశ్చయం మాత్రం చేసుగున్నాడు.

"మీ ఆజ్ఞని నేను ధిక్కరిస్తానా? అవశ్యం అలానే పదండి" అంటూ లేచాడు.

మెరిసిపోయే కొత్త "బ్యూక్" కారులో, అప్సరసలాంటి ఇరవైయేళ్ళ యువతి పక్కన కూర్చుని, విశాలమైన వీధుల్లోంచి తాను ప్రయాణం చేయడం ఇదే ప్రథమం. రమేశ్‌ని ఎన్నో ఆలోచనలు ముంచెత్తుతూనైన్నై. అతని ముఖంలో ఒక నూతన కళారేఖ ఉదయించి, మనస్సు హాయిగా తేలిగ్గా వుంది. ఇదివరకూ ఆలోచన లుండేవి. కాని అవి చచ్చేంత బరువుగా వుండి, వాటిని మోయడం భయంకరంగా వుండేది. కాని ఈ ఆలోచనలు అతి తేలిగ్గావుండి, శరీరాన్ని గాలిలో తేలుస్తూ, తీయని వాంఛల్ని రేకొడు తూన్నాయి.

ఎంతో ఆప్యాయంతో ఆలా పక్కన కూచుని ఆవిడ అడుగుతూన్న ప్రశ్నలకి ప్రత్యుత్తరా లిస్తూనేవున్నాడు. ఎన్నాళ్ళనుంచో ఆవిడతో పరిచయంగలవాడిలా అతి చనువుగా మాట్లాడు తున్నాడు. కారు నడుస్తోంది. ఆగుతోంది. వీరు దిగుతూన్నారు. మళ్ళీ ఎక్కుతున్నారు.

ఎన్నో హోటళ్ళల్లో, ఎన్నో తోటల్లో, పార్కుల్లో మనస్ఫూర్తిగా తిరిగి తిరిగి అలసి, రాత్రి ఒంటిగంటకి ఇంటికి చేరుకుంది మోటారు. ఇంటికి వచ్చేలోగానే రమేశ్ హృదయంలో ...విడ హత్తుకొనిపోయింది. ఆవిడ చూపుల్లో ఏవో ...వాలు వ్యక్తమతూన్నయి. అత్యంతసుందరమై ...కర్షణీయమైన ఆవిడ శరీరం రమేశ్‌కి, ఇదివరకు ...కె వేయిరెట్లు అందంగా కనిపించింది.

"రెండుగంటలు కావస్తోంది రమేశ్! ఇంత ...త్రి చీకట్లో పాపం ఇంటికేం వెడతావు లే, ...క్కడే పడుకో" అని అనునయిస్తూ అందావిడ.

రమేశ్ తను ఆడుతూన్నది నాటకమనే ...తి మరిచిపోయాడు. అతని శరీరం ఏదో ...వ్యాహికకి తగుల్కొన్నట్టుగా వుంది. అతని ...ణంలో నిగ్రహించుకుందామన్నా వీల్లేనంత ...వేకం పొంగుతోంది. అమాంతంగా లేచి, ...ణీ!" అంటూ విశాలమైన తన బాహువుల్లో ఆ ...ని బంధించి మైమరచిపోయాడు.

తెల్లవారకముందే లేచి యింట్లో ప్రవేశిం...డు రమేశ్. ఎంతో అలసిపోయినవా డిలా ...ల్లులమంచానికి చేరగిలబడి, కోటు విప్పుతూంటే ...బులో ఏదో ఘనపదార్థం తగిలింది. తీసి చూశాడు... పది వందరూపాయల నోట్ల కట్ట... తన కళ్ళని తనే నమ్మలేకపోయాడు రమేశ్. ప్రస్తుతం అతనిలో ఒకేభావం పరుగెత్తుతోంది. అది. "నిజంగా ఇన్నాళ్ళూ తను మేల్కొనే వున్నట్టయితే, ఇలాంటి ఎన్నినోట్లకి అధికారి కాగలిగేవాడు కదా" అని మాత్రమే.

* * *

ప్రస్తుతం రమేశ్ జీతం నెలకి మూడువందలు. రామదయాల్ సేట్ కుమార్తెలూ, గృహిణీ, నౌకర్లూ అంతా రమేశ్‌ని విధిగా గౌరవించి తీరతారు. అతనిమీద ఇప్పుడే కంప్లెయింటూ సేట్జీకి అందదు. సేట్జీ గృహం ఎంతగా ఇప్పుడు కలకల్లాడుతోందో రమేశ్ ఇల్లూ అలానేవుంది. ఇప్పుడక్కడ ఆకలితో కుళ్ళిచచ్చే పరిస్థితిలేదు. కాంతికీ, చీకటికీ, గల తారతమ్యాలను సమీక్షిస్తూంటాడు రమేశ్ "నీవు తప్పుదోవన పడ్డావ్" అని అప్పుడప్పుడ అతని ఆత్మమాత్రం ఏదో అతనికి చెప్పి చూడబోతుంది. కాని, ఆ హెచ్చరిక వినే తీరిక రమేశ్ కిప్పుడులేదు. "తలలోతు పిచ్చికి నిదర్శనాలీ ఆత్మ ప్రబోధాలు" "ఇది బలహీనుల తత్వం" "నాదే సక్రమమార్గం" అని రమేశ్ సంతృప్తి పడతాడు...

స్కెచ్

# అంతు దొరకని సత్యం

వై. వి. శర్మ

"బాబూ! బిచ్చం పెట్టించండి" అన్నాడు హీనస్వరంతో ఓ ముష్టివాడు.

"వెధవా! దెయ్యంలాగున్నావ్? ముష్టి ఎత్తుకోకపోతే కూలిపని చేసుకోరాదూ?" అని కసురుకున్నాడు ధర్మరాజుగారు.

"చెయ్యడాని కోపిక లేదు బాబూ. గుప్పెడు బియ్యంవేస్తే వెళ్ళిపోతా" అన్నాడు దీనంగా ముష్టివాడు.

"పోవెధవా, అన్నా పోరు యీ పాడు ముండాకొడుకులు. ఇటువంటివాళ్లు సంఘానికి వేరుపురుగులు" అన్నాడు ధర్మరాజు. ప్రక్కనున్న నేను ఆయన మాటలకు ఏమీ అంత ఆశ్చర్యపోలేదు. ఆయనకు ఎప్పుడూ ధర్మం చేసే అలవాటులేదని నాకు తెలుసు. అందుకే చాలామంది ఆయన్ని (అ) ధర్మరాజుగారని పిలుస్తూంటారు. "బాబూ" అని మళ్ళీ హెచ్చరించాడు ఆ ముష్టివాడు. కాని లాభం లేకపోయింది. వెళ్ళిపోతూ, "కూటికీ గుడ్డకీ నోచుకోకపోయినా, మాటంటే పడరయ్యోయ్" అని యీసడించాడు. ధర్మరాజు నాకేసి తిరిగి "చూశారూ! వాడికెంత పొగరో! అయినా వీ డెవడో చూడగా కమ్యూనిస్టు రకంలా కనిపిస్తున్నాడు!" అని అపహాస్యం చేశాడు. నాలో నేను నవ్వుకున్నాను.